
-అబ్బరాజు జయలక్ష్మి



# నీకేం తెలీదు మమ్మీ

సుందరమూర్తి, శారదలకు ఇద్దరే సంతానం - సౌమ్య, సాగర్. పిల్లలకు తగినంత స్వేచ్ఛ ఇచ్చినా పద్ధతిగా పెరగాలని బుద్ధిమంతులుగా తయారవ్వాలని వాళ్ల కోరిక. అక్కాతమ్ముడు ఇద్దరూ చదువులోను, అల్లరిలోను అన్నింటిలోను తామే ముందు అన్నట్లుగా ఉంటారు. సౌమ్య డిగ్రీ ఫైనలియర్ చదువుతుంటే సాగర్ ఇంటర్‌లోకి అడుగుపెట్టాడు. అన్నిటికీ తల్లి మీదే ఆధారపడే పిల్లలు ఉన్నట్లుండి తనను, తన మాటలను నిర్లక్ష్యం చేయటం శారదకు చాలా బాధగా ఉంది.

'చూస్తుండగానే పిల్లలు ఎంతగా ఎదిగిపోయారు. అమ్మా! అమ్మా! అంటూ తన కొంగు వదలకుండా తిరుగుతున్నట్లే ఉంది. వాళ్లకు తెలియని సంగతులన్నీ కుతూహలంగా తరచి తరచి తెలుసుకునేవారు.

ఏ పండుగ వచ్చినా, ఏ ఫంక్షన్‌కు వెళ్లాలన్నా ఏ డ్రెస్ వేసుకోవాలి, ఎలా తయారవ్వాలి అంటూ సౌమ్య తననే సలహా అడిగేది. తను చెప్పినట్లు వినేది. అలాంటిది ఇప్పుడు తన మాట వినదు. తన అభిప్రాయాలతో పని లేదు.

పిల్లలు ఎల్లకాలం తల్లి చిటికెన వేలు పట్టుకుని తిరగరు. అది మంచి పద్ధతి కూడా కాదు. వాళ్లకంటూ ప్రత్యేకమైన అభిప్రాయాలు ఉండాలి. సంపూర్ణ వ్యక్తిత్వంతో పెరగాలి. నిజమే, కాని ఈ మధ్య ప్రతి దానికి 'నీకేం తెలీదు' అనే మాట పిల్లల నోటి వెంట వినిపిస్తుంటే తనకెందుకో మనసు చివుక్కుమంటోంది.

* * *

సాగర్ పిక్నిక్‌కి వెళ్లాలంటూ రెండు వేల రూపాయలు కావాలని అడిగాడు. 'అంత డబ్బెందుకు' అని తను అడిగింది.

'నీకు తెలీదు మమ్మీ! నీకు చెప్పినా అర్థం కాదులే. మా కాలేజీ వాళ్ళతో కలిసి టూర్‌కి వెళుతున్నాను. నాకు ఖర్చులు ఉండవా ఏంటి?'' అంటూ వెంటనే సమాధానం చెప్పాడు. సరదాగా ఫ్రెండ్స్‌తో పిక్నిక్ అంటే వద్దనటం ఎందుకులే అని భర్తను ఒప్పించి పంపించే ఏర్పాటు చేసింది. కాలేజీలో చేరాక సాగర్‌కి ఫ్రెండ్స్ ఎక్కువయ్యారు. ఫ్రెండ్ ఇంట్లో చదువుకుంటానని, ఎక్స్‌ట్రా క్లాసులు ఉన్నాయని చెప్తూ రాత్రిళ్లు కొంచెం లేట్‌గానే వస్తున్నాడు.

* * *

చేత్తో కూరల బేగ్‌తో ఇంట్లో అడుగుపెట్టిన శారదకు సౌమ్య గదిలో నుండి సౌమ్య క్లాస్‌మేట్ రజని గొంతు వినిపించింది. వంటింట్లోకి వెళ్ళబోతున్నదల్లా వాళ్ల మాటల్లో తన గురించిన ప్రస్తావన వినపడితే ఒక్క క్షణం నిలబడింది.

'ఏంటి సౌమ్యా! సమీర్‌తో రేపు సినిమాకు వస్తానని చెప్పావట. బాయ్‌ఫ్రెండ్స్‌తో సినిమాలకు వెళితే మీ ఇంట్లో ఏమీ అనరా? మా అమ్మ అయితే అస్సలు ఒప్పుకోదు'

'మా అమ్మకు తెలిస్తే కదా! ఆమెదంతా చాదస్తం. నేను సమీర్‌తో స్నేహం చేస్తున్నానని తెలిస్తే గొడవ చేస్తుందని ఇంతవరకు తెలియకుండా జాగ్రత్త పడుతున్నాను'

'అంటే మీ ఇద్దరిదీ వొట్టి స్నేహం మాత్రమే అంటావా?'

'స్నేహమేనా అంటే ప్రస్తుతానికి అంతే అనుకో. కాని అతను చాలా అందంగా ఉంటాడు. చక్కగా మాట్లాడతాడు. ఐ లైక్ హిమ్'

సౌమ్య మాటలు విన్న శారదకు ఒక్కసారిగా గుండెల్లో రాయి పడ్డట్టయింది. సౌమ్య మొండిగా ప్రవర్తిస్తోంది అనుకున్నదే కాని ఇలాంటి స్నేహాలు కూడా ఉన్నాయని తెలియదు. అసలు సంగతేమిటో కనుక్కోవాలనుకుంది.

రాత్రి భోజనాలయ్యాక శారద వంట గది సర్దుతూ 'సౌమ్యా! పెరట్లో బట్టలున్నాయి. తీసి లోపల పెట్టు' అంటూ కూతుర్ని కేకేసింది.

'అబ్బా! ఇప్పుడు తీయకపోతే ఏమవుతుంది? రేపు ఉదయం తీసుకోవచ్చు కదా!' అంటూ నసుగుతూనే పెరట్లోకి వెళ్లి సౌమ్య బట్టలు తీయసాగింది. శారద కూడా వెనకాలే వచ్చి బట్టలు మడత పెడుతూ సౌమ్య వంక చూసి 'సమీర్ ఎవరు?' అని ప్రశ్నించింది.

అనుకోకుండా తల్లి అలా అడిగేసరికి కంగారుపడుతూ 'సమీర్ ఎవరూ?' అంటూ తిరిగి ప్రశ్నించింది.

'సాయంత్రం నువ్వూ, నీ ఫ్రెండ్ మాట్లాడుకుంటుంటే నేను విన్నాన్లే. సమీర్ ఎవరు? చెప్పు. లక్షణంగా కాలేజీకి వెళ్ళి నీ దచువు నువ్వు చదువుకుని రాక మగ పిల్లలతో స్నేహాలేమిటి? వాళ్లతో సినిమాలు, షికార్లు ఏమిటి?' అంటూ నిలదీసింది.

ఉన్నట్లుండి తల్లికి సమాధానం చెప్పవలసి వచ్చేసరికి కొంచెం షాకయిన సౌమ్య వెంటనే తేరుకుని 'నీకు తెలీదు మమ్మీ! ఇప్పుడందరూ అలాగే ఉంటారు. అయినా బాయ్ ఫ్రెండ్ ఉంటే తప్పేమిటట.' అంటూ తల్లిని తప్పించుకుని లోపలికి పోబోయింది.

సౌమ్య రెక్క పట్టుకుని లాగి 'ఏమిటే! నాకు తెలియనిది.

సాయంత్రం నువ్వూ, నీ ఫ్రెండ్ మాట్లాడుకుంటుంటే నేను విన్నాన్లే. సమీర్ ఎవరు? చెప్పు. లక్షణంగా కాలేజీకి వెళ్ళి నీ దచువు నువ్వు చదువుకుని రాక మగ పిల్లలతో స్నేహాలేమిటి? వాళ్లతో సినిమాలు, షికార్లు ఏమిటి?'

నీకు తెలిసిందీను. మాట్లాడుతుంటే అలా వెళ్ళిపోతావు. పిచ్చిపిచ్చి వేషాలు మానేసి కుదురుగా ఉండటం నేర్చుకో. లేకపోతే కాలేజీ మాన్పించాల్సి ఉంటుంది' అంటూ హెచ్చరించింది. తల్లి వంక ఓ చూపు చూసి విసురుగా లోపలికి వెళ్ళిపోయింది సౌమ్య.

* * *

పండుగ వస్తోందని ఇల్లంతా బూజులు దులిపి అన్ని గదులూ నీట్‌గా సర్దుతోంది శారద. సాగర్‌కి ఎన్నిసార్లు చెప్పినా తన వస్తువులను నీట్‌గా సర్దుకోడు. పుస్తకాలు, బట్టలు అన్నీ ఎక్కడివి అక్కడే పడేయటం, ఇల్లంతా చిందర వందరగా ఉంచటం ఈ మధ్య బాగా అలవాటయింది. బట్టల అలమర సర్దుతున్న శారద చేతికి దొరికిన వస్తువును చూసి స్థాణువులా నిలబడిపోయింది. మెల్లగా హాల్లోకి వచ్చి సోఫాలో కూలబడింది. ఆమె శరీరం ఒక్క క్షణం అచేతనంగా అయిపోయింది. కాని మనసు మాత్రం పరిపరి విధాలుగా ఆలోచిస్తోంది. సాగర్ స్మోకింగ్ అలవాటు చేసుకున్నాడా! ఎలా జరిగిందిది? చెడు స్నేహాల వల్లే వీడికి ఇటువంటి అలవాట్లు వచ్చి ఉంటాయి. ఆ సిగరెట్ పెట్టె దొరకటం వల్లే తనకు ఈ సంగతి తెలిసింది. ఈ వయసుకే ఇటువంటి అలవాట్లయితే! వీడిని ఎలా దారిలోకి తీసుకురావాలి' అని అనేక విధాల ఆలోచనలతో సతమతమవసాగింది శారద.

* * *

సుందరమూర్తి ఆఫీసు పని మీద ఎక్కువగా క్యాంపులకు వెళ్ళవలసి వస్తూ ఉంటుంది. నెలలో దాదాపుగా ఇరవై రోజులు ఊళ్ళోనే ఉండడు. మిగిలిన పది రోజులైనా పిల్లల విషయాలు వివరంగా తెలుసుకునే తీరిక అతనికి ఉండదు. వాళ్ల బాగోగులు కాని, ఆలనా పాలనా కాని తనకన్నా శారదే బాగా చూసుకోగలదని నమ్ముతాడు. ఎప్పుడైనా టైమ్ దొరికితే పిల్లలతో వాళ్ల చదువుకు సంబంధించిన విషయాలు మాట్లాడి వాళ్ల ప్రోగ్రెస్ గురించి తెలుసుకుని సంతోషిస్తుంటాడు.

* * *

ఇంటి ముందు ఆటో ఆగిన చప్పుడయితే లోపలి నుండి తొంగి చూసింది శారద. సౌమ్య, రజని ఇంట్లోకి వస్తున్నారు. రజని ముఖంలో ఆందోళన, సౌమ్య ముఖంలో నిరాశా నిస్పృహలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. సౌమ్యను ఒక్కసారిగా అలా చూడగానే ఆమెలోని తల్లి మనసు తల్లడిల్లింది. సౌమ్యను గదిలోకి పంపి రజని శారద దగ్గరకు వచ్చింది. జరిగిన విషయం ఏమిటంటే సమీర్ మరొక అమ్మాయితో కలిసి వెళుతుండగా చూసిన సౌమ్య అతని గురించి ఆరా తీయగా తెలిసిందేమిటంటే అతనికి ఇలా ఎందరో గర్ల్‌ఫ్రెండ్స్ ఉన్నారని ఎందరితోనో అతనికి సంబంధాలు ఉన్నాయని, అలాగే సౌమ్యను కూడా లోబరచుకోవాలని స్నేహం చేస్తున్నట్లుగా నటిస్తున్నాడని తెలిసింది. వెంటనే వెళ్ళి సౌమ్య అతన్ని నిలదీసింది. ముందు అంతా వట్టిదే అని తప్పించుకోబోయాడు. తరువాత నా ఇష్టం. నువ్వేంటి నన్ను అడిగేది? నీకు ఎంతమంది నాలాంటి ఫ్రెండ్స్ ఉన్నారో నాకేం తెలుసు' అన్నాడు. అకస్మాత్తుగా ఈ నిజాన్ని తట్టుకోలేని సౌమ్య సమీర్‌ను బాగా దులిపేసి తరువాత రజనితో చెప్పి బాధపడింది.

రజని సౌమ్యను ఓదార్చి ఏ పొరపాటు జరగక ముందే అతని నైజం తెలిసినందుకు సంతోషించమని ధైర్యం చెప్పి వెంటపెట్టుకుని ఇంటికి తీసుకువచ్చింది.

'సౌమ్యను ఏమీ అనకండి ఆంటీ. తను అసలే బాధపడుతోంది' అంది రజని.

'అలాగే' అంటూ శారద రజనికి కృతజ్ఞతలు చెప్పి పంపించింది.

* * *



**అమ్మకేమీ తెలీదు అంటూ మీ తెలివి తేటలతో మీరు చేసిందేమిటి? పెద్ద వాళ్ళ మాట పెడచెవిన పెట్టి చెడు మార్గంలో నడవటమేనా మీకు తెలిసింది? విజ్ఞతతో వ్యవహరించకపోతే ఆ ఆకర్షణలో పడి అనేక రకాలైన మోసాలకు, ప్రమాదాలకు గురి కావలసి వస్తుంది.**

ఎప్పటిలాగే కేంప్‌కు వెళ్ళిన మూర్తి పండుగకు ముందుగానే తిరిగి వచ్చాడు. పిల్లల ప్రవర్తన గురించి, జరిగిన విషయాలన్నీ అతని దగ్గర ఏదీ దాచకుండా చెప్పి బాధపడింది శారద.

కొంతకాలం ఎందుకో శారద నిరుత్సాహంగా ఉండటం తనూ గమనిస్తూనే ఉన్నాడు. ఏమిటని అడిగితే ఏమీ చెప్పదు. పిల్లల విషయంలో ఎప్పుడూ వాళ్ల ఆటపాటల గురించి, వాళ్ల తెలివితేటల గురించి, తనతో చెప్పటమే గాని ఏనాడూ ఏ విషయంలోనూ వాళ్ళ గురించి తనకు ఒక్కసారి కూడా కంప్లయింట్ చేసింది లేదు. తనకు సమయం ఎక్కువగా ఉండదని వాళ్ల మంచి చెడు, చదువు సంధ్యల బాధ్యతలు అన్నీ తనే చూసుకుంటుంది. 'పిల్లలతో నేను మాట్లాడతానులే' అని చెప్పి భార్యను ఓదార్చాడు.

* * *


ఇచ్చిన స్వేచ్ఛను దుర్వినియోగం చేసుకుని దురలవాట్లకు లోనవుతున్న సాగర్‌తోను, తమ నమ్మకాన్ని వమ్ము చేసే విధంగా ప్రవర్తించి అదృష్టవశాత్తూ సమీర్ నిజ స్వరూపం ముందుగానే తెలుసుకోగలిగిన సౌమ్యతోనూ మాట్లాడాడు సుందరమూర్తి.

'మాట్లాడితే చాలు అమ్మతో 'నీకేం తెలీదు. నీకేం తెలీదు' అని మీరిద్దరూ ఈ మధ్య ఎక్కువగా అనటం నేను వింటూనే ఉన్నాను. అమ్మకేమీ తెలీదు అంటూ మీ తెలివితేటలతో మీరు చేసిందేమిటి? పెద్దవాళ్ళ మాట పెడచెవిన పెట్టి చెడు మార్గంలో నడవటమేనా మీకు తెలిసింది? మంచికన్నా ముందు చెడుకు సంబంధించినదే ఎక్కువ ఆకర్షణీయంగా ఉంటుంది. విజ్ఞతతో వ్యవహరించకపోతే ఆ ఆకర్షణలో పడి అనేక రకాలైన మోసాలకు, ప్రమాదాలకు గురి కావలసి వస్తుంది.

మీ అమ్మ మీలాగా కాలేజీకి వెళ్ళి చదువుకుని ఉండకపోవచ్చు. కంప్యూటర్ నాలెడ్జి లేకపోవచ్చు. కాని లోకరీతి తెలుసు. పిల్లలకు ఎప్పుడు ఏం కావాలో వాళ్ళ మనసేమిటో ఒక్క అమ్మకే తెలుస్తుంది. నోరు తెరిచి మీరు అడగకముందే మీ ఆకలిని గుర్తించి తీర్చటం అమ్మకు మాత్రమే తెలుసు. ఏ కన్నతల్లి కూడా తన బిడ్డలపై కోపాన్ని గాని, అసూయా ద్వేషాలను గాని పెంచుకోదు. కాని పెరిగి పెద్దవాళ్లయ్యే కొద్దీ చాలామంది పిల్లలు మాత్రం తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తుంటారు. కాస్త చదువుకోగానే అతిశయంతో ప్రవర్తిస్తుంటారు. కని పెంచిన తల్లి వాళ్లకు తెలివితక్కువ దానిగా కనిపిస్తుంది. అది చాలా పొరపాటు.

అమ్మ ఎప్పటికీ అమ్మే. ఆమె మనసు నిండా మమతల వెల్లువలే. పిల్లలు ఎంత ఎదిగినా ఆమెకు మాత్రం అడ్డాల నాటి బిడ్డలే. ఆమె కురిపించే మమతానురాగాలలో మార్పు ఉండదు. కాని తన చేతుల్లోనే పెరిగి పెద్దయిన పిల్లలు తనను చులకనగా చూస్తే మాత్రం ఏ తల్లీ తట్టుకోలేదు. భరించలేదు. అంతేకాదు. మీ వయసుకు మించిన అలవాట్లు, ఆలోచనలు మీరు చేస్తున్నారు. మీ ప్రవర్తన వల్ల మీ అమ్మ చాలా బాధపడుతోంది. ఆమె మనసును కష్టపెట్టడం మీకు భావ్యం కాదు. నేను చెప్పవలసింది చెప్పాను. ఇక మీదటైనా జాగ్రత్తగా నడుచుకుంటారని అనుకుంటున్నా. ఆ తర్వాత మీ ఇష్టం' అంటూ ముగించాడు మూర్తి. ★

శ్రీమతి నందమూరి లక్ష్మీపార్వతి రచన



భజగోవిందం

వచ్చే వారం నుంచి ప్రారంభం